**విలేఖరులు కావలెను**

తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభ' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.

ఫోన్ - 8985829417




# సూర్య ప్రభ

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 1 సంచిక: 364 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | మంగళవారం, జూన్ 24 2025 | పేజీలు : 4


# రాజకీయవర్గాల్లో విస్తృత చర్చ

## వచ్చే ఎన్నికల నాటికి లోక్‌సభ, అసెంబ్లీల పునర్విభజన ఖాయమనే సంకేతాలు




## విధి, విధానాలపైనే అందరి ఆసక్తి

## మహిళా రిజర్వేషన్లు, జమిలి ఎన్నికలు ఖాయమనే భావన

లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు రంగం సిద్ధమవుతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 20 శాతం పార్లమెంటు, అసెంబ్లి సీట్లు పెరగవచ్చనే ఊహాగానాలు విపిస్తున్నాయి. దీంతో రాజకీయ వర్గాల్లో కొత్త ఆశలు పుట్టుకొస్తున్నాయి. మహిళా రిజర్వేషన్ల అమలు, జమిలి ఎన్నికలు ఖాయమనే భావనతో అందరిలో ఆసక్తి నెలకొంది. రాజకీయ పార్టీలు, కీలకనేతలు సీట్ల విభజనను ఏమేరకు ప్రభావితం చేయగలుగుతారనే అంశం చర్చనీయాంశమైంది. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన, జమిలి ఎన్నికలపై రాజకీయవర్గాల్లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. రాబోయే సార్వత్రిక ఎన్నికలు స్పష్టమైన మార్పుల తో జరుగుతాయనే అభిప్రాయం బలంగా వినిపిస్తోం ది. చట్టసభల్లో మహిళలకు మూడోవంతు రిజర్వేష న్లు కల్పించే బిల్లు ఇప్పటికే ఆమోదం పొందగా, వచ్చే సార్వత్రిక ఎన్నికల నుంచి అమలు చేయాల్సి ఉంది. తాజాగా జనగణనతోపాటు కులగణన చేపడుతుండడంతో ఈ లెక్కల ఆధారంగా బీసీ వర్గాలకు సైతం చట్టసభల్లో రిజర్వేషన్లకు గ్రీన్‌సిగ్నల్ వస్తుందనే ఆశాభావం వెల్లడవుతోంది. ఈ కీలక మార్పుల తోపాటు జనగణన ముగిసిన వెంటనే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనకు రంగం సిద్ధమవుతుండడంతో లోక్‌సభ సీట్లను పెంచే ప్రాతిపదిక ఆధారంగా రాష్ట్రంలో సీట్ల సంఖ్య ఏమేరకు పెరుగుతుందనే అంశంపై స్పష్టత రానుండగా, లోక్‌సభ సీట్ల కు తీసుకున్న ప్రామాణికతనే అసెంబ్లీ సీట్లు పెంచడానికి తీసుకుంటారా..?లేకఏపీ పునర్విభజన చట్టం లో పేర్కొన్న ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ల సీట్ల సంఖ్యను పెంచుతారా..?అనే అంశంలోనూ స్పష్ట త రావాల్సి ఉంది. రాజకీయ పార్టీలు, కీలకనేత లు సీట్ల విభజనను ఏమేరకు ప్రభావితం చేయగలుగుతారనే అంశంతోపాటు, డీలిమిటేషన్ విధి విధానాలు ఎలాఉంటాయనే అంశంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తాజాగా వస్తున్న సమాచారం ప్రకారం లోక్‌సభ సీట్లను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతమున్న సీట్లకు 20 శాతం అదనంగా పెంచుతారనే సంకేతా లు వస్తున్నాయి. లోక్‌సభ సీట్ల పునర్విభజనను జనా భా ప్రాతిపదికన చేపడితే కుటుంబ నియంత్రణను కట్టుదిట్టంగా అమలు చేసి జనాభా నియంత్రణకు తోడ్పడిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే ఆందోళనల నేపథ్యంలో కేంద్రం జనాభాతో సంబం ధం లేకుండా రాష్ట్రాలవారీగా 20శాతం సీట్లు పెంచే దిశగా ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గాల సరిహద్దులు మారడంతో పాటు, కొత్త జిల్లాల సరిహద్దులు, కొత్త మండలాల సరిహద్దుల ఆధారంగా నియోజకవర్గాల ఏర్పాటు జరుగుతుందని, ప్రస్తుతమున్న నియోజకవర్గాల పరిధిని సర్దుబాటు చేస్తారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పునర్విభజన నోటిఫికేషన్ వస్తే పూర్తి స్పష్టత వస్తుందని, రాజకీయపార్టీలు సైతం ప్రస్తుతం అంతర్గతంగా కసరత్తు చేస్తున్నప్పటికీ నోటిఫికేషన్ వచ్చాక తమ పార్టీల వారీగా ప్రతిపాదనలు ఇచ్చేదాన్ని బట్టి మార్పులు, చేర్పులుంటాయని చెబుతున్నారు.

**మహిళలకు సీట్లు ఖాయం...** జనగణన, కులగణన, అనంతరం నియోజకవర్గాల పునర్విభజనతోపాటు జమిలి ఎన్నికలు జరిపే విషయమై కేంద్రం పట్టుదలగా ఉండడంతో రాబోయే సార్వత్రిక ఎన్నికలు జమిలిగా జరుగుతాయని అంచనా వేస్తున్నారు. జమిలి నిర్ణయం తీసుకుంటే 2028 చివరలో జరగాల్సిన రాష్ట్ర శాసనసభ ఎన్నికలను ఆరు నెలలు వాయిదా వేసి, 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికలతో కలిపి నిర్వహిస్తారని చెబుతున్నారు. అదేవిధంగా మహిళలకు రిజర్వేషన్లు అమల్లోకి రానుండడంతో తెలుగు రాష్ట్రాల్లో వారికి భారీగానే సీట్లు ఇచ్చే అవకాశం మెండుగా ఉండనుంది. అయితే ఏ నియోజకవర్గాలు మహిళలకు కేటాయిస్తారనే అంశం కొత్తగా రూపొందే నియోజకవర్గాల ప్రకారం జనాభా ప్రాతిపదికన ఎంపిక చేస్తారని తెలుస్తోంది. అదేవిధంగా బీసీలకూ చట్టసభల్లో రిజర్వేషన్లు ప్రకటిస్తే ఆ మేరకు ఆయా వర్గాలకు సీట్ల కేటాయింపు ఉంటుందని ఆశిస్తున్నారు. మొత్తంగా రాబోయే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు పలు మార్పులు, చేర్పుల మధ్య, పలు కీలక సామాజిక సమీకరణాల నడుమ కొనసాగుతాయనే అంశం స్పష్టమవుతుందని, రాజకీయాల్లో పూర్తిమార్పు రాబోతోందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.




హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇవాళ సిట్ విచారణకు హాజరయ్యారు అప్పటి సీఎస్ శాంతి కుమారి. ఫోన్ ట్యాపింగ్ చేసిన ఎస్ఐబీ.. రివ్యూ ప్యానెల్ నూ తప్పుదోవ పట్టించిందని స్టేట్ మెంట్ ఇచ్చారు. ఫోన్ ట్యాపింగ్ కోసం ఎస్ పంపిన నంబర్లను రివ్యూ చేసి అభ్యంతరం తెలిపినట్టు ఆమె వెల్లడించారు. అయినా యథేచ్ఛగా ట్యాపింగ్ జరిగింది. ఇంతకూ ఎస్ఐబీ ఎవరి కంట్రోల్ లో పనిచేసింది..? ఆ విభాగానికి బాస్ ఎవరు..? అన్నది హాట్ టాపిక్ గా మారింది. గతంలో విచారణ సందర్భంగా మాజీ డీఎస్పీలు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్న, డీసీపీ రాధాకిషన్ రావు స్టేట్ మెంట్లను సిట్ తీసుకుంది. వారిచ్చిన నేరాంగీకరపత్రంలో అప్పటి బీఆర్ఎస్ సుప్రీం ఆదేశాలతోనే ఫోన్ ట్యాపింగ్ చేసినట్టు చెప్పారు. ఈ కేసులో ఏ1గా ఉన్న ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు మాత్రం అప్పటి డీజీపీ, ప్యానల్ ఆదేశాలతోనే ట్యాపింగ్ చేసిట్టు చెప్పారు. ప్రతి విషయం ప్యానల్ ముందుంచామని, ఆ మేరకు ట్యాపింగ్ జరిగిందని పేర్కొన్నారు. దీంతో సిట్ ఇవాళ ప్యానల్ లో సభ్యురాలిగా ఉన్న శాంతి కుమారిని విచారణకు పిలిచింది. ఆమె నుంచి స్టేట్ మెంట్ తీసుకున్నది. గతంలో అప్పటి డీజీపీ మహేందర్ రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్ కుమార్, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునంద్ రావు స్టేట్ మెంట్ ను సిట్ ఇదివరకే తీసుకున్నది. అందరూ తమనకు ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు తప్పుదోవ పట్టించారని చెప్పారు.



## ఉజ్జయిని మహంకాళి బోనాలకు రండి..

## సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక

హైదరాబాద్ : జులై 13న సికింద్రాబాద్ లోని ఉజ్జయిని మహంకాళిఅమ్మవారి దేవస్థానంలో నిర్వహించనున్న బోనాల మహోత్సవాల్లో పాల్గొనాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆలయ అధికారులు ఆహ్వానించారు. సోమవారం సెక్రటేరియట్ లో మంత్రి కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ అధికారులు ముఖ్య మంత్రిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డికి ఉజ్జయిని మహంకాళి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. మరో వైపు ఈ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది.





హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఇవాళ(సోమవారం) కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రి మండలితో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించారు. ప్రధానంగా స్థానిక సంస్థల ఎన్నికలు, బనకచర్లపై చర్చ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై పీసీ ఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌కి గత కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రివర్గ ఆమోదం ఉందా లేదా అనే అంశంతో పాటు పూర్తి వివరాలను ఈ నెల 30వ తేదీలోగా కమిషన్‌కి అందివ్వాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పీసీ ఘోష్ కమిషన్‌కు మినిట్స్‌తో కూడిన పూర్తి నివేదిక ఇవ్వాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే స్పోర్ట్స్ పాలసీని కేబినెట్ ఆమోదించింది.

రేపు(మంగళవారం) తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా విజయోత్సవ సభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 9 లక్షల ఫిర్యాదులను స్పెషల్ డ్రైవ్ ద్వారా క్లియర్ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. కాగా, మంత్రివర్గ సమావేశానికి కొత్తగా బాధ్యతలు చేపట్టిన మంత్రులు వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి హాజరయ్యారు.

# నేడు రైతు భరోసా పండుగ!

## సంబరాలు చేసుకుందాం...







తెలంగాణ రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి నిరూపించుకుంది. రైతు భరోసా పథకం కింద కేవలం 9 రోజుల్లోనే కోట్లాది రూపాయల నిధులను రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ చేసినట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ పథకం ద్వారా ఇప్పటివరకు కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన ఉద్ఘాటించారు. ఇది ఎకరానికి రూ. 12,000 చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించబడిందని భట్టి స్పష్టం చేశారు. ఈ భారీ నిధుల విడుదల, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వ నిబద్ధతను చాటుతోంది.

**వ్యవసాయ వృద్ధికి చేయూత..** గాంధీభవన్‌లో టీపీసీసీ (తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ) అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కోఆర్డినేటర్ల సమావేశంలో భట్టి విక్రమార్క ఈ వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో ఏఐసీసీ (అఖిల భారత కాంగ్రెస్ కమిటీ) ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, సీడబ్ల్యూసీ (కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ) సభ్యులు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. రైతు భరోసా కింద నిధుల పంపిణీ ఈ నెల జూన్ 16న ప్రారంభమై.. జూన్ 24తో పూర్తవుతుందని భట్టి వివరించారు. ఈ స్వల్ప వ్యవధిలో ఇంత పెద్ద మొత్తంలో నిధులను రైతులకు చేరవేయడం ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం. వ్యవసాయ పెట్టుబడి కోసం రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ఇది గణనీయంగా తగ్గిస్తుంది. విత్తనాలు, ఎరువులు, కూలీ ఖర్చులు వంటి వాటికి ఈ నిధులు ఉపయోగపడతాయి. ఇది రైతులను అప్పుల ఊబి నుండి కాపాడి, ఆత్మవిశ్వాసంతో వ్యవసాయం చేయడానికి ప్రోత్సహిస్తుంది. తద్వారా రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి పెరుగుతుంది. రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి.

**రైతు భరోసా సంబరాలు ..** రైతు భరోసా నిధుల విడుదల నేపథ్యంలో.. మంగళవారం సాయంత్రం 4 గంటలకు అన్ని మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలను పెద్ద ఎత్తున చేపట్టాలని భట్టి విక్రమార్క సూచించారు. ఈ సంబరాలు.. ప్రభుత్వ పథకాల పట్ల ప్రజల్లో అవగాహన పెంచి, విశ్వాసాన్ని పెంపొందించడానికి దోహదపడతాయి. రైతులు తమకు అందిన సహాయాన్ని బహిరంగంగా ఆనందంగా జరుపుకోవడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ నిబద్ధత అందరికీ తెలుస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోనుందని తెలుస్తోంది. రైతులకు నీటిపారుదల సౌకర్యాలు, పంటలకు మద్దతు ధరలు, పంట నష్టాలకు పరిహారం వంటి అంశాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించనుంది. రైతు భరోసా పథకం తెలంగాణలోని లక్షలాది మంది రైతన్నల జీవితాల్లో కొత్త ఆశలను నింపి, వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు దగ్గర నుంచి కూడా 4 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు రైతుభరోసా నిధులు జమ చేయలేదు. మొదటి సారి ఈ విధంగా ఎకరాలతో సంబంధం లేకుండా.. ప్రతీ భూమికి రైతుభరోసా అందించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# అనుమతిలేని పనులు



హైదరాబాద్: విదేశీ జాతి శునకాలు తమపై దాడి చేస్తున్నాయంటూ జీహెచ్ఎంసీకి ఫిర్యాదులు పెరుగుతున్నాయి. అనుమతి లేకుండా నగరంలోకి దిగుమతి అవుతున్న వేలాది విదేశీ జాతి శునకాలపై నిఘా కొరవడిందని, నగరంలోనూ సంతానోత్పత్తి కేంద్రాలు వందలాదిగా నడుస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదులు పెరుగుతుండటంతో జీహెచ్ఎంసీ స్పందించింది. కొన్ని ఘటనలపై ఇటీవల విచారణ జరిపి, శునకాల లైసెన్సులు రద్దు చేసింది. దాడి చేసే స్వభావమున్న వాటిని స్వాధీనం చేసుకుంది.

**నిబంధనల ఉల్లంఘన**

నగరంలోకి ఏదేనీ జంతువును కొత్తగా తేవాలంటే జీహెచ్ఎంసీ అనుమతి తప్పనిసరి. అయినా పలువురు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తూ విదేశీ జాతుల శునకాలను తీసుకొస్తున్నారు. మరికొందరు ఇక్కడే అక్రమంగా సంతానోత్పత్తి కేంద్రాలు నడిపిస్తున్నారు. మార్కెట్లో ఎక్కువ ఆదరణ ఉండే జాతులను ఉత్పత్తి చేసేందుకు, క్రూరమైన మార్గాలు ఎంచుకుంటున్నారు. బ్రీడింగ్ కేంద్రాలకు జీహెచ్ఎంసీ, రాష్ట్ర పశు వైద్యశాఖ అనుమతి ఉండాలి. సంతానోత్పత్తికి ఉపయోగించే వాటి ఆరోగ్యం, వయసు నిబంధనల ప్రకారం ఉండాలి. కేంద్రాల్లో అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలి. ఆడ శునకాలను జీవితకాలంలో నాలుగు లేదా ఐదుసార్లే సంతానోత్పత్తికి ఉపయోగించాలి. ఒక్కో ఈతకు ఏడాది దూరం ఉండాలి. కానీ శునకాలను ఇరుకు బోన్లలో ఉంచి, క్రూరంగా వ్యవహరిస్తున్నారని 2021లో జంతు ప్రేమికులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో జీహెచ్ఎంసీ తనిఖీలు నిర్వహించి పదుల కొద్దీ అనుమతి లేని బ్రీడింగ్ కేంద్రాలు మూసేసింది. తర్వాత పట్టించుకోకపోవడంతో మళ్లీ పుట్టుకొచ్చాయి.

**అప్పట్లోనే నిషేధం..**

ఏడాది కిందట కేంద్ర ప్రభుత్వం 25 విదేశీ జాతి శునకాలపై నిషేధం విధించగా, వాటిని నిలుపుదల చేస్తూ కొన్ని రోజులకే మరో ఉత్తర్వు వెలువడినట్లు జీహెచ్ఎంసీ చెబుతోంది. దాంతో విదేశీ కుక్కలను అనుమతించాల్సి వస్తుందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. కుక్క మనిషిపై దాడి చేసినట్టుగా, బాధితుడు ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నట్టు ఆధారాలు చూపితే.. ఆయా శునకాల లైసెన్సు రద్దు చేసి.. వాటిని స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు. రాట్ వైలర్, చౌచౌ, డొగొ అర్జెంటీనో, అమెరికన్ పిట్ బుల్ తదితర విదేశీ జాతులపై గతంలో కేంద్రం నిషేధం విధించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం అందులోని కొన్ని జాతుల కుక్కలపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కేసు విచారణలో ఉందన్నారు. కరిచే కుక్కలకు కారుణ్య మరణాన్ని ప్రసాదించేందుకు అనుమతి ఇవ్వాలంటూ హైకోర్టును కోరామని.. ఆ కేసు విచారణ కూడా రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో ఉందని జీహెచ్ఎంసీ చెబుతోంది.

# వైద్యుడు రాయకున్నా వాడేస్తున్నారు..

కరీంనగర్ : 60 ఏళ్లకుపైబడిన ఓ వృద్ధురాలు మూత్ర సంబంధిత సమస్యతో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు మందులు రాసి నెల తర్వాత రావాలని సూచించారు. కానీ ఆమె మళ్లీ ఆస్పత్రికి వెళ్లకుండా వారు రాసిచ్చిన మందులు వాడుతూ గడిపారు. కొన్ని నెలల తర్వాత విపరీతమైన దగ్గు రావడంతో కరీంనగర్‌లో ఓ వైద్యుడిని సంప్రదించగా ఊపిరితిత్తుల్లో అలర్జీ ఉందని తేలింది. యాంటీబయాటిక్ అధిక వినియోగమే కారణమని గుర్తించారు. అవి మానేసిన 10 రోజులకు దగ్గు సమస్య తగ్గిపోయింది. కరీంనగర్‌లో 40 ఏళ్ల వ్యక్తికి తీవ్ర జ్వరంతో స్థానిక ఆర్ఎంపీ వద్దకు వెళ్లగా ఆరు రోజులు మూడు వేర్వేరు రకాల యాంటీబయాటిక్స్ ఇచ్చారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో బాధితుడు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా యాంటీబయాటిక్స్ విచ్చలవిడి వినియోగంతో పరిస్థితి విషమించిందని గుర్తించారు. చికిత్స తరవాత కోలుకున్నారు. వ్యాధి నివారణకు అవసరమైతే తప్ప యాంటీబయాటిక్స్ వాడొద్దు.. అదీ నిర్ణీత కోర్సుగా వాడాలని వైద్యులు సూచిస్తున్నప్పటికీ కొందరు పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా కరోనా తర్వాత జ్వరం, దగ్గు, జలుబు, విరేచనాలు వంటివి రాగానే వ్యాధి గురించి చెప్పి ఔషధ దుకాణాల్లో మందులు అడుగుతున్నారు. కొందరు దుకాణదారులు సాధారణ మందులు ఇవ్వడానికే పరిమితం కాకుండా యాంటీబ



యాటిక్స్ ఇస్తున్నారు. అదీ కోర్సు ప్రకారం కాకుండా ఇష్టం వచ్చిన డోసు చెబుతున్నారు. కొందరు ఆర్ఎంపీలు ఇలానే వ్యవహరిస్తున్నారు. దీంతో దుష్పరిణామాలు తప్పడం లేదు.

వ్యాధి తీవ్రతను బట్టి యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. అవసరం లేకపోయినా వాడితే రోగ నిరోధక శక్తి తగ్గిపోయి ఆ మందులు కూడా పనిచేయని పరిస్థితి ఏర్పడుతుంది. ఇటీవల రాష్ట్ర ఔషధ నియంత్రణ విభాగం డీజీ షానవాజ్ ఖాసిం రాష్ట్ర వ్యాప్తంగా తాము జరిపిన తనిఖీల్లో 193 మందుల దుకాణాలు యాంటీబయాటిక్స్ అమ్మకాల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య నిపుణులు రాసిన చీటీ లేకుండా మందుల దుకాణాల్లో యాంటీబయాటిక్స్ వంటి ఔషధాలు ఇవ్వవద్దని నిబంధనలున్నాయి. ఇచ్చిన మందులకు కొనుగోలుదారులకు పూర్తి వివరాలతో కూడిన బిల్లులు ఇవ్వాల్సి ఉంటుంది. అర్హత లేని వారు మందులు విక్రయించొద్దు. కానీ చాలా దుకాణాల్లో ఈ నిబంధనలు పాటించడం లేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడు వేలకుపైగా మందుల దుకాణాలు ఉన్నాయి. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే 1300లకుపైగా ఈ దుకాణాలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

**నోటీసులిచ్చాం**

జిల్లాలో గత వారం దుకాణాలు తనిఖీ చేసి నిబంధనలను పాటించని నాలుగు దుకాణాలకు షోకాజు నోటీసులు ఇచ్చాం. వారి నుంచి జవాబు సరైన రీతిలో రానట్లయితే చర్యలు తీసుకుంటాం. శ్రీనివాసులు, సహాయ సంచాలకులు, ఔషధ నియంత్రణ శాఖ, కరీంనగర్

**అవసరమైన మేరకే..** వ్యాధి తీవ్రత, రోగి బరువు, రోగ నిరోధక శక్తి వంటివి పరిశీలించిన అనంతరం యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. నేరుగా దుకాణం నుంచి తెచ్చుకొని వాడటం సరి కాదు. కొందరు రెండు, మూడు రోజులు వినియోగించి వ్యాధి తగ్గగానే వదిలేస్తున్నారు. ఇలాగైతే వ్యాధిని తట్టుకునే శక్తి తగ్గిపోతుంది. డాక్టర్ విజయమోహన్‌రెడ్డి, సీనియర్ ఫిజీషియన్

# కదలని బోట్లు.. విహారానికి పాట్లు

కరీంనగర్ : కరీంనగర్‌లో పర్యాటకం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. రాష్ట్రంలోని పర్యాటకులను కరీంనగర్ మానేరు డ్యాం బోటింగ్ ఆకట్టుకోలేకపోతుంది. శాఖల సమన్వయలోపంతో బోటింగ్ సౌకర్యాలు మెరుగుపడటం లేదనే విమర్శలు ఉన్నాయి. మానేరు డ్యాంలో స్పీడు, సాధారణ బోట్లు తీసుకొచ్చారు. దాదాపు వంద మందితో కలిసి చిన్న పార్టీలు బోటులో చేసుకోవచ్చని పార్టీవేర్ బోటు తెప్పించారు. అట్టహాసంగా ప్రారంభించిన ఈ బోటు మరో చిన్న బోట్లకు బేస్‌గా మారి నేడు శిథిలమైంది. జెట్‌స్కై డబుల్ రైడర్ బోట్లు రెండు తెప్పించారు. ఆరంభంలో కొంతమంది ఎక్కారు. ఇప్పుడు వాటి దిక్కు చూడటం లేదు. మళ్లీ కొన్ని రోజులకు దాదాపు రూ.కోటి వెచ్చించి క్రూజ్ ఏసీ బోటు తెప్పించారు. ఇది తయారు చేయించి దాదాపు నాలుగేళ్లు అవుతున్నా ఒక్కసారి కూడా నడిపించలేకపోయారు. మానేరు డ్యాంకు వెళ్లిన వారికి శిథిలమైన, నీటిలో తేలియాడే బోట్లు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం మానేరు గేట్ల పక్కన 20 సీట్ల డీలక్స్ బోటు, 4 సీట్ల స్పీడు



బోటు మాత్రమే నడుస్తున్నాయి.

వేసవి వచ్చిందంటే నీటి మట్టం తగ్గిపోతుంది. దీంతో ఈ సీజన్‌లో పర్యాటకులు అంతగా రావడం లేదు. వాతావరణ పరిస్థితులు, ఈదురుగాలులు, వర్షాలు, తుఫాను ప్రభావంతో బోటింగ్ సేవలు నిలిపివేస్తారు. ఒక్క శీతాకాలంలో ఉన్న ఈ రెండు బోట్లలో పయనించేందుకు సగటున రోజుకు 150-200 మంది వస్తారని అధికారులు అంటున్నారు. క్రూజ్ బోటు కూడా అందుబాటులోకి తెస్తే పర్యాటకులు పెరిగే అవకాశం ఉంది. ఇటీవల కలెక్టర్ క్రూజ్ బోటు నడిపించకపోవడానికి గల కారణాలు సమీక్షించారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా క్రూజ్ బోటు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్‌కు సూచించారు.

**ప్రతికూల పరిస్థితులతో.. కనీస వసతులు కరవు** బోటింగ్‌కు వచ్చిన వారు కూర్చునేందుకు కుర్చీలు, శౌచాలయాలు, మంచినీటి వసతి లేవు. స్నాక్స్ సౌకర్యం కనిపించదు. మానేరు డ్యాం పక్కనే ఉన్న బైపాస్ నుంచి నిత్యం 20 నుంచి 30 వేల మంది వేములవాడకు వెళ్తుంటారు. వీకెండ్‌లో 50 వేల వరకు వెళ్తున్నట్లు అంచనా. ఇందులో కనీసం 500ల మంది బోటింగ్ సేవలు వినియో గించుకున్నా.. అధికంగా ఆదాయం వస్తుందని అంచనా. అయితే ఈ బైపాస్‌పై బోటింగ్ సేవలపై ఒక్క బోర్డు కూడా కనిపించని పరిస్థితులున్నాయి.

# మీ కేసు దర్యాప్తులో ఉంది!




హైదరాబాద్: "మా అబ్బాయి అదృశ్యమై నాలుగేళ్లు.. ఆచూకీని పోలీసులు గుర్తించలేకపోయారు".. ఓ తండ్రి ఆవేదన. "బ్యాంకు నుంచి రూ.200కోట్లు కాజేసిన మాయగాడు అరెస్టయి బెయిల్‌పై బయటకు వచ్చాడు. విదేశాలకు చేరాడు. దర్యాప్తు అధికారి నిర్లక్ష్యమే కారణమంటారు బాధితులు" "పదుల సంఖ్యలో బంగారు దుకాణదారులను మోసగించిన మాయగాడు రూ.కోట్లు కాజేసి మాయమయ్యాడు. 6నెలలు కష్టపడి కేసును కొలిక్కితెచ్చా. టీమ్‌ను అప్పగిస్తే రెండ్రోజుల్లో నిందితుడిని అరెస్ట్ చేస్తానని ఓ ఎస్సై" తెలిపారు. సిబ్బంది లేరంటూ ఉన్నతాధికారులు వాయిదా వేస్తున్నారని వివరించారు.

"మాది కీలకమైన పోలీస్‌స్టేషన్ ఏడాదికి 1300-1500 కేసులు నమోదవుతుంటాయి. 11 మంది ఎస్సైలు ఉండాల్సిన చోట ఏడుగురే ఉన్నారు. నలుగురు నిత్యం ప్రముఖుల బందోబస్తులో ఉంటారు. ముఖ్యమైన కేసుల దర్యాప్తుపై దృష్టి సారించలేకపోతున్నా"మంటూ ఓ ఎస్‌హెచ్‌వో ఆవేదన.

నగరంలో పోలీసింగ్ కత్తిమీదసాము. కేసుల నమోదు, శాంతిభద్రతల నిర్వహణ, బందోబస్తు సమన్వయం చేసుకోవటం సవాల్‌గా మారుతోంది. అధికసమయం బందోబస్తులోనే ఉండటంతో కేసుల పరిష్కారంపై దృష్టి సారించలేకపోతున్నారనేది బహిరంగ రహస్యం. ఏటేటా పెరుగుతున్న కేసులు..పనిభారంతో ఎక్కువ మంది మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. సుమారు 30 మంది ఇన్‌స్పెక్టర్లు మల్టీజోన్‌కు పంపమంటూ ఉన్నతాధికారులకు వినపతిపత్రం ఇచ్చారంటే పరిస్థితి ఎంతగా మారిందనేది అర్థం చేసుకోవచ్చు. మరికొందరు అయిష్టంగానే విధులు నిర్వర్తిస్తున్నారని అధికారులే అంగీకరిస్తున్నారు. సున్నితమైన, రాజకీయప్రభావిత ప్రాంతాల పరిధిలోని ఠాణాల్లో బాధ్యతలు చేపట్టిన ఎస్‌హెచ్‌వోలు 1-2 ఏళ్ల వ్యవధిలోనే బదిలీపై వెళ్తున్నారు. తూర్పుమండలం పరిధిలోని ఒక పోలీస్‌స్టేషన్‌లో ఏడాది వ్యవధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు మారారు. ఉత్తరమండల పరిధిలో రెండు ఠాణాల్లో ఇదే పరిస్థితి. రెండేళ్ల క్రితం చోరీ కేసులో పోయిన సొమ్ము రికవరీ కోసం వారానికోసారి స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తోందని ఒక బాధితుడు ఆవేదన. నిందితులు యూపీలో ఉన్నట్టు గుర్తించాం.. అక్కడకు బృందాన్ని పంపుదామంటే కుదరట్లేదంటూ ఆ ఠాణా డీఐ అభిప్రాయం.

**ఏం చేయమంటారు.. చెప్పండి**

పాతబస్తీలోని సున్నితమైన ప్రాంతంలోని ఠాణా.. ఏడుగురు ఎస్సైలు అవసరం కాగా ముగ్గురితో నడిపిస్తున్నారు. పెరుగుతున్న కేసులతో కొద్దికాలంగా ఫిర్యాదులు తీసుకోవటం మానేశారు. ఇరువర్గాలను పిలిచి రాజీ చేసుకోమంటూ సూచించి వదిలేస్తున్నట్టు సమాచారం. బాధితుల ప్రతి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేయాలి. నిర్దేశించిన సమయంలో న్యాయస్థానంలో అభియోగపత్రాలు దాఖలు చేయాలి. ఇదీ పోలీస్‌స్టేషన్లకు ఉన్నతాధికారుల ఆదేశాలు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని పోలీసు వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. నెలలో కనీసం రెండు కేసులు కూడా పూర్తిగా దర్యాప్తు చేయలేకపోతున్నామని నగరానికి చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ చెప్పారు. రికార్డులను తారుమారు చేసి రూ.కోట్లు విలువైన భూములు కాజేసేందుకు ఒక ముఠాపై నమోదైన కేసు దర్యాప్తు ఆర్నెల్లుగా సాగుతోంది. సంచలనం రేకెత్తించిన వృద్ధ దంపతుల హత్య కేసు కొలిక్కిరాలేదు. అఫ్జల్‌గంజ్‌లో కాల్పులకు పాల్పడిన బిహార్ ముఠా ఆనవాళ్లు ఇప్పటికీ గుర్తించలేకపోయారు.

# మంత్రపురి.. ప్రగతి సిరి

మంథని : మంథని పురపాలక సంఘం పరిధిలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో వివిధ పనులకు రూ.350 కోట్లు మంజూరయ్యాయి. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) కింద రూ.36 కోట్లు మంజూరు కాగా ఈ ఏడాది జనవరి 6న మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. రూ.2 కోట్ల వ్యయంతో డంప్‌యార్డు, రూ.4 కోట్లతో సమీకృత కూరగాయల మార్కెట్, రూ.7 కోట్లతో ప్రధాన కూడళ్లలో, మంథని-పెద్దపల్లి, మంథని-కాటారం ప్రధాన రహదారులపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనులు, రూ.4 కోట్లతో పురపాలక సంఘం కార్యాలయ భవనం, రూ.19 కోట్లతో వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, భూగర్భ మురుగుకాలువల నిర్మాణాలు చేపట్టారు. **పూర్తయిన సీసీ రహదారుల నిర్మాణం**

టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టిన పనుల్లో సీసీ రోడ్లు, భూగర్భ మురుగుకాలువల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పురపాలక సంఘం కార్యాలయ భవన నిర్మాణం ప్రగతిలో ఉంది. డంప్‌యార్డు నిర్మాణానికి ఎగ్లాస్‌పూర్ గుట్ట సమీపంలో స్థలం కేటాయించగా, అటవీ శాఖ అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయాయి. పట్టణంలో సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణం కోసం పాత మార్కెట్‌ను మరో చోటుకు తరలించాల్సి ఉంది. తరలించకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. ప్రధాన కూడళ్లలో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనులకు సామగ్రి కొనుగోలుకు, పరికరాల పరీక్షలకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. **రూ.125 కోట్లతో గోదావరిపై వారధి**



మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో మంథని గోదావరి తీరం నుంచి మంచిర్యాల జిల్లా శివ్వారం వరకు వంతెన నిర్మాణానికి రూ.125 కోట్లు, మంథని-పెద్దపల్లి, మంథని-కాటారం మార్గాల్లో బైపాస్ రోడ్ల నిర్మాణాలకు రూ.162 కోట్లు, పట్టణంలో 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులకు రూ.22 కోట్లు మంజూరయ్యాయి. గతేడాది డిసెంబరు 4న సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపల్లి పర్యటనలో ఈ పనులకు శంకుస్థాపన చేశారు. టెండర్ల ప్రక్రియ ముగియడంతో పనులు ప్రారంభమవుతున్నాయి. గోదావరిపై వంతెన నిర్మాణం కోసం ఇరువైపులా ఒడ్డును తవ్వి ర్యాంపులు వేశారు. పియర్స్ కోసం భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారు. 50 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం వివిధ ప్రభుత్వ కార్యాలయాలు కూల్చివేశారు. బైపాస్ రోడ్ల నిర్మాణానికి భూ సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న అభివృద్ధి పనులు ప్రారంభం కావడంపై పట్టణ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# పట్టింపులేని క్రమబద్ధీకరణ

కరీంనగర్: జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరపాలిక, శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ(సుడా) పరిధిలో లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్)పై నిర్లక్ష్య ధోరణి నెలకొంది. దరఖాస్తుదారులు ఆసక్తిగా ముందుకు రాకపోవడంతో ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. మరోవైపు పట్టణ ప్రణాళిక అధికారులు సైతం ఇతర విధుల్లో నిమగ్నమయ్యారు. కార్యాలయాల్లో వీటికి సంబంధించిన ప్రత్యేక అధికారి, కేంద్రం ఎత్తేయడం, సరైన సమాధానం ఇచ్చేవారు లేకపోవడంతో దరఖాస్తుదారులకు ఇబ్బందికరంగా మారింది. అయితే దరఖాస్తులు పరిష్కరించుకోవడానికి ఫీజు, ఇతర రాయితీ ఛార్జీల్లో 25 శాతం ప్రకటించారు. ఈ నెల 30 వరకు గడువు పెంచడం గమనార్హం.

**అధికారుల చుట్టూ ప్రదక్షిణ**

ఖాళీ స్థలాన్ని క్రమబద్ధీకరించుకోవడానికి ముందుకొస్తే అన్ని సవ్యంగా ఉండి ఫీజు చెల్లించిన తర్వాత కొర్రీలు పెడుతుండటంతో ఆ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎల్-1 పట్టణ ప్రణాళిక, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఉండగా వీరు ఎక్కడ ఉంటారో, ఎవరికి దరఖాస్తు వెళ్లిందో తెలియని గందరగోళం ఉంటుంది. కొందరి



దరఖాస్తుదారులు ఎల్-1 అధికారుల దగ్గర లేవనే సమాధానం వస్తుంది. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొస్తే పట్టించుకోవడం లేదని ఆగ్రహిస్తున్నారు.

**ఫీజు చెల్లించినా.. ఉత్తర్వులు ఏవి?**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా అనుమతి ఉత్తర్వులు ఇవ్వాలి. కానీ పెండింగ్‌లో చూపిస్తూ సరైన పత్రాలు అప్‌లోడ్ చేయలేదనే కారణాలు పేర్కొంటూ ఎల్-1, ఎల్-2 అధికారుల చుట్టూ తిప్పుతున్నారు. కొన్ని గ్రామాల పేర్లు ఆయా ఎల్-1 అధికారుల లాగిన్‌లలో కనిపించడం లేదు. ఇదేంటని ప్రశ్నిస్తే సమాధానం ఇచ్చే అధికారులే లేరు. ఒక్క కరీంనగర్ కార్పొరేషన్‌లోనే 8,150 మంది దరఖాస్తుదారులు ఫీజు చెల్లించగా రూ.40.22 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో 3,823 మంది దరఖాస్తులకు మాత్రమే ప్రొసీడింగ్స్ ఇచ్చారు. ఇంకా 4,327 ఉత్తర్వులు పెండింగ్‌లో ఉన్నాయి. ఫీజు వసూలు చేసిన అధికారులు అనుమతులు ఇవ్వడంలో వెనకడుగు వేయడంపై దరఖాస్తుదారులు ఆగ్రహిస్తున్నారు.

**పరిష్కారం కాని సాంకేతిక సమస్యలు**

క్రమబద్ధీకరణ దరఖాస్తులకు సాంకేతిక సమస్యలు అడ్డుగా ఉంటున్నాయి. వీటిని పరిష్కరించాల్సి ఉండగా క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ఈ సమస్య ఉందని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

# హద్దులు చెరిపేస్తూ.. దస్త్రాలు మార్చేస్తూ..

కరీంనగర్ : రేకుర్తి సమీపంలోని 39 గుంటల భూమి విషయంలో లేని సర్వే నంబర్లను పుట్టించి అక్రమంగా పక్కన ఉన్న జాగాను కబ్జా చేసిన ముగ్గురిపై కొత్తపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. రెండ్రోజుల కిందట నమోదైన ఈ భూవివాదంలో అధికారుల పాత్రపైన పోలీసులు దృష్టిసారిస్తున్నారు. ఏళ్ల తరబడి రెవెన్యూ రికార్డుల్లో లేని కొత్త సర్వే నంబర్లు ఎలా పుట్టుకొచ్చాయనే విషయంలో లోతుగా పరిశీలన చేపడుతున్నారు. ఇందుకు కారకులెవరనే కోణంలోనూ దర్యాప్తు చేపడుతున్నారు. గతంలోనూ ఇదే విధంగా రేకుర్తికి సంబంధించి ఏడెనిమిది కేసులు ఠాణాల్లో నమోదయ్యాయి.

2017-18లో చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన సమయంలో రేకుర్తితోపాటు కరీంనగర్ చుట్టుపక్కల ఉన్న బొమ్మకల్, ఆరెపల్లి, సీతారాంపూర్, అలుగునూర్ ప్రాంతాల్లోని భూముల విషయంలో నయా మోసానికి కొందరు తెర తీశారనేది భూదందాల్లో నమోదైన కేసులను బట్టి తెలుస్తోంది. భూ మోసాలు, నకిలీ పత్రాలు, డబుల్ రిజిస్ట్రేషన్‌లకు భూదస్త్రాలను నవీకరించే సమయంలో కొన్ని చోట్ల మార్పులు చేసుకున్నారనేది అర్థమవుతోంది. జిల్లా



మొత్తంగా రికార్డుల నవీకరణకు ముందు 2,32,234 సర్వే నంబర్లుండగా ఆ తర్వాత బై నంబర్లు, రీసర్వే నంబర్లతో మరో 25-30 వేల వరకు పెరిగాయి. పెరిగిన వాటి విషయంలో చాలా చోట్ల సరిహద్దుల వివాదాలే ఉండటం గమనార్హం. కరీంనగర్ భూదందా కథ ఇంకా కొనసాగుతూనే ఉంది. తాజాగా కొత్తపల్లి మండలం రేకుర్తిలోని విలువైన జాగా విషయంలో మరోమారు భూవివాదం జిల్లాలో చర్చనీయాశంగా మారింది. గడిచిన ఏడాది నుంచి వరుస కేసులతో భూమోసాలకు పాల్పడిన వారి బండారం బయటపడుతూనే ఉంది.

భూదందాల్లో భాగమైన వారు సీపీ అభిషేక్ మహంతి బదిలీ తరువాత ఊపిరి పీల్చుకున్నారు. కరీంనగర్ కమిషనరేట్‌లో భూములకు సంబంధించి జరిగిన అన్యాయాలు, ఆర్థిక మోసాలకు సంబంధించి దాదాపు 3వేల మంది బాధితులు ఫిర్యాదులు చేశారు. ఎకనామిక్ అఫెన్స్ వింగ్ పేరిట ఏర్పాటైన వ్యవస్థ ఇక పని చేయట్లేదనుకుంటున్న తరుణంలో సీపీ గౌష్ ఆలం పాత కేసుల ఫిర్యాదులను తిరగేస్తున్నారు. దీంతో అక్రమాల్లో భాగమైనవారిలో ఒకింత అలజడి మొదలైంది.

**వారి సహకారమే..**

మొత్తం భూ దందాల్లోని ప్రతి కేసులో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలకు సంబంధించిన కొందరు ఉద్యోగులు, అధికారుల పాత్ర స్పష్టంగా ఉందనేది బాహాటంగానే కనిపిస్తోంది. గత అధికారుల హయాంలో జరిగినట్లు కొన్ని కేసుల్లో తప్పుడు రికార్డులు సృష్టించారు. కొందరు మాత్రం పాత రికార్డులను దిద్దారని మరికొన్ని కేసుల విచారణలో బయటపడింది. కొందరు రెవెన్యూ ఉద్యోగులపై కేసులు నమోదవగా ఇంకొందరు అదే బాటలో విచారణను, కేసులను ఎదుర్కొనే అవకాశముంది. పోలీసులు కొన్ని కేసుల్లో ప్రధాన నిందితులపై కేసులు నమోదు చేయడంతోనే సరిపెట్టి రికార్డుల తారుమారుకు సహకరించిన వారిని విస్మరిస్తున్నారు.




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. 2018 ఎన్నికల వేళ ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు సిట్ అధికారులకు తాజాగా ఆధారాలు లభించాయి. ప్రణీత్‌రావు నుంచి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావుకు ట్యాపింగ్ సమాచారం చేరేది. ప్రభాకర్ రావు ఆదేశాలతోనే టాస్క్‌ఫోర్స్ టీమ్ రంగంలోకి దిగింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారానే ప్యారడైజ్ వద్ద భవ్య ఆనంద్‌ప్రసాద్‌కు చెందిన రూ. 70లక్షల డబ్బును టాస్క్‌ఫోర్స్ అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం. దుబ్బాక ఉప ఎన్నికల సమయంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఎన్నికల్లో పోటీ చేసిన రఘునందన్‌రావు బంధువులకు చెందిన రూ. కోటి కూడా ఫోన్ ట్యాపింగ్‌తో వచ్చిన సమాచారం మేరకే సీజ్ చేశారని తెలుస్తోంది. బేగంపేట పరిధిలో రాధాకిషన్‌రావు, ఆయన బృందం రూ. కోటి సీజ్ చేసింది. మునుగోడు ఉప ఎన్నికల సమయంలోనూ ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు సమాచారం. నల్గొండ కాంగ్రెస్ నేతల అనుచరుల నుంచి రూ. 3.50 కోట్లు స్వాధీనం చేసుకున్నారు.



## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తే బాధ్యత నాయకులదే: మీనాక్షి నటరాజన్

హైదరాబాద్: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. "రాజ్యాంగ పరిరక్షణకు జై సంవిధాన్ కార్యక్రమంపై అవగాహన పెంచాలి. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత నాయకులపై ఉంది. సీనియర్లు, జూనియర్లు సమన్వయంతో కలిసి పనిచేయాలి"అని సూచించారు.

## రైతుభరోసా సంబరాలు చేపట్టాలి: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 9 రోజుల్లో రూ. కోట్లలో రైతు భరోసా నిధులు విడుదల చేసినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇప్పటి వరకు కోటి 49లక్షల 39వేల 111 ఎకరాలకు రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఎకరాకు రూ. 12వేల చొప్పున అన్ని వ్యవసాయ భూములకు అందించినట్లు తెలిపారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కో ఆర్డినేటర్ల సమావేశంలో భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథం, రాష్ట్ర గ్రంథాలయ ఛైర్మన్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు. రైతు భరోసా కింద నిధులను రైతుల ఖాతాల్లో ఈ నెల 16 నుంచి జమ చేస్తున్నామని.. ఇది జూన్ 24తో పూర్తవుతుందని భట్టి వివరించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం 4 గంటలకు అన్ని మండల కేంద్రాల్లో రైతు భరోసా సంబరాలు పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.






హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై కేంద్రమంత్రి బండి సంజయ్ ఆధారాలతో సహా బయటపెట్టగానే భారాస నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని భాజపా ఎమ్మెల్యే రాజా సింగ్ మండిపడ్డారు. బండి సంజయ్‌పై భారాస నేతలు చేసిన వ్యాఖ్యల్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ముమ్మాటికి అవినీతి ప్రాజెక్టేనని వ్యాఖ్యానించారు. "కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో మాది.. మా పార్టీది ఒకే అభిప్రాయం. ఈ ప్రాజెక్టుపై ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా చెప్పిన మాటలకే మేమూ కట్టుబడి ఉంటాం. భారాస నేతల వైఖరి చూస్తుంటే 'ఉల్టా చోర్ కొత్వాల్ డాంటే' అన్నట్లుగా ఉంది. ప్రధాని మోదీ చెప్పినట్లు భారాస కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంది. ఇది వాస్తవం కాదా? రూ. 8వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో రూ. 1.20లక్షల కోట్లకు పెంచలేదా?ఆనాడు కేసీఆర్ స్వయం ప్రకటిత ఇంజినీరు అవతారం ఎత్తి కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారు. ఈనాడు ఆయన కుమారుడు ఎన్‌డీఎస్‌ఏ కంటే తానే తెలివైన మేధావిగా ప్రవర్తిస్తున్నారు"అని రాజాసింగ్ విమర్శించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై తీర్పు రిజర్వ్ చేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇవాళ(సోమవారం) విచారణ జరిపింది. ఆరు నెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున న్యాయవాదులు తమ వాదనలను కోర్టుకు వినిపించారు. ఎన్ని రోజుల్లో ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహిస్తుందో చెప్పాలని హైకోర్టు పిటీషనర్లను ప్రశ్నించింది. గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని.. ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదని న్యాయస్థానం నిలదీసింది. తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే ఇంకా పూర్తి అవ్వలేదని కొంత సమయం కావాలని కోర్టుని ప్రభుత్వం కోరింది. ఎన్నికలు నిర్వహించడానికి మరో 60 రోజులు సమయం కావాలని ఎలక్షన్ కమిషన్ అడిగింది. ఎన్నికలైనా పెట్టాలని లేదా పాత సర్పంచ్‌లనే కొనసాగించాలని పిటీషనర్లు వాదనలు వినిపించారు. ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తి చేయాలనే నిబంధన ఉందని.. కానీ ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహించలేదని పిటీషనర్లు వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. పిటీషనర్లు, ప్రభుత్వం, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వాదనలు విన్న తర్వాత న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా 2024 ఫిబ్రవరి 1వ తేదీన తెలంగాణ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన విషయం తెలిసిందే.







## 'సాయంత్రంలోగా చంపేస్తాం..' ఎంపీ రఘునందన్‌కు బెదిరింపు కాల్

హైదరాబాద్: భాజపా ఎంపీ రఘునందన్‌రావుకు పీపుల్స్‌వార్ మావోయిస్టు పేరుతో బెదిరింపు కాల్ వచ్చింది. సోమవారం సాయంత్రంలోగా చంపుతామంటూ ఆగంతకుడు ఫోన్ చేశాడు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన మావోయిస్టునంటూ బెదిరించాడు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడలో ఓ ప్రైవేటు పాఠశాల కార్యక్రమానికి ఎంపీ హాజరైన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఫోన్‌కాల్‌ను రఘునందన్ పీఏ లిఫ్ట్ చేశారు. బెదిరింపు కాల్‌పై డీజీపీ, మెదక్ జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులకు రఘునందన్ ఫిర్యాదు చేశారు.




ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా బంకర్ బస్టర్లతో విరుచుకుపడటంతో టెహ్రాన్ ప్రతీకార వాంఛతో రగిలిపోతోంది. దాని ఎదుట కూడా ఆప్షన్లు పరిమితంగానే ఉండటంతో హార్మూజ్ జలసంధిని ఆయుధంగా వాడుకోవడానికి వ్యూహరచన చేస్తోంది. గతంలోను పలుమార్లు దీనిని మూసేస్తానని హెచ్చరించినా.. అంత సాహసం చేయలేదు. ఈ జలసంధిని కొన్ని గంటలు లేదా రోజులు మూసేస్తేనే ముడిచమురు ధరలు భగ్గుమంటాయని జేపీ మోర్గాన్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. 70శాతం ద్రవ్యోల్బణానికి , ఆర్థికవృద్ధిని దెబ్బతీయడానికి కారణమవుతాయని వెల్లడించారు.

అమెరికా దాడులకు ప్రతీకారం తీర్చుకోవాలంటే దానికి చాలా మార్గాలున్నాయి. అయితే ఇరాన్ హార్మూజ్‌ను మూసివేయాలంటే తన అతిపెద్ద చమురు కస్టమర్ అయిన చైనా అనుమతి ఉండాలి. ప్రతిదాడులకు సిద్ధం కావాలంటే చాలా విషయాలను టెహ్రాన్ దృష్టిలో పెట్టుకోవాలి. అలాగే ఇరాన్ తీరప్రాంత రక్షణ వ్యవస్థలను అమెరికా, ఇజ్రాయెల్ నాశనం చేసే అవకాశం కూడా ఉంది.

**వాణిజ్య నౌకలపై వేధింపులు..** ఇరాన్ హార్మూజ్ తీర ప్రాంతంలో తిరిగే నౌకలపై స్వల్ప వేధింపుల నుంచి తీవ్రస్థాయి చర్యల వరకు పాల్పడవచ్చు. గతంలో ఇరాన్ తమ ప్రాదేశిక జలాల్లో నుంచి వెళుతున్న నౌకలను కొన్నిసార్లు నిలిపేసిన సందర్భాలున్నాయి.

వాణిజ్య నౌకల వద్దకు ఇరాన్‌కు చెందిన చిన్న క్రాఫ్ట్ బోట్లు చేరుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకొంటున్నట్లు బహ్రెయిన్‌కు చెందిన మారిటైమ్ ఫోర్స్ వెల్లడించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి చర్యలు ఉద్రిక్తతలకు దారితీస్తాయి.

**జామింగ్ చర్యలకు పాల్పడటం..** షిప్పింగ్ పరిశ్రమను ప్రధానంగా ప్రభావితం చేసే అంశం ఇది. ప్రస్తుతం ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం మొదలైన నాటినుంచి ఈ మార్గంలో ప్రయాణించే నౌకల జీపీఎస్ సిగ్నల్స్‌లో తీవ్ర అవరోధాలు ఎదురవుతున్నాయి.

జూన్ 13 నుంచి ప్రతిరోజు దాదాపు పెద్దసంఖ్యలో నౌకలకు ఇలాంటి అనుభవాలు ఎదురవుతున్నాయి. దీంతో అవి సరైన మార్గాన్ని గుర్తించడం కష్టమవుతోంది.

**సముద్ర మైన్లతో ఉచ్చు పన్నడం..** హార్మూజ్‌లోని నౌకలు ఎదుర్కొంటున్న ప్రధాన ముప్పులో ఇది కూడా ఒకటి. ఇరాన్ కొత్తగా వీటిని పరిశీలిస్తే.. ఈ మార్గంలో రావాలంటే నౌకలు భయపడే పరిస్థితి తలెత్తుతుంది. 2019లో ఇరాన్ సీమైన్స్ వాడి నౌకలను దెబ్బతీసిందని అమెరికా ఆరోపించింది. అయితే అప్పట్లో ఇరాన్ దీనిని తోసిపుచ్చింది. ఈ మైన్స్ ముప్పు ఇరాన్ నౌకలకు కూడా పొంచి ఉంటుంది.

**హూతీల వలే దాడులు..** ఎర్ర సముద్రంలో హూతీ రెబల్స్ అనుసరిస్తున్న వ్యూహాన్ని హార్మూజ్‌లో ఇరాన్ పాటించడం. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకొని.. డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా ఇజ్రాయెల్, అమెరికా, యూకే వంటి పశ్చిమ దేశాలతో సంబంధాలున్న ఇరాన్ టార్గెట్లోకి వచ్చే అవకాశాలున్నాయి. సూయజ్ కాల్వలా దీనికి ప్రత్యామ్నాయ మార్గం లేదు. టెహ్రాన్ ఈ వ్యూహాన్ని ఎంచుకొంటే మాత్రం పంపిణీ వ్యవస్థలపై తీవ్రస్థాయిలో ప్రతికూల ప్రభావం పడుతుంది.

**చమురు సరఫరాను దెబ్బతీయడం..** హార్మూజ్ జలసంధిని మూయకుండా.. చమురు సరఫరాలను దెబ్బతీసే ఆప్షన్ కూడా ఇరాన్ ఎదుట ఉంది. 2019లో సౌదీ అరేబియాకు చెందిన అరామ్‌కో చమురు ప్రాసెసింగ్ వ్యవస్థలపై దాడులు చేయించింది. ప్రపంచంలో 7శాతం ఉత్పత్తి ఇక్కడినుంచే జరుగుతుంది. పొరుగుదేశాల్లోని చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకొనే అవకాశాలున్నాయి. కానీ, అప్పుడు ఆయా దేశాలు కూడా టెహ్రాన్‌కు వ్యతిరేకంగా మారతాయి. ఖార్గ్ ద్వీపంలోని దాని చమురు క్షేత్రాలను ప్రత్యర్థులు లక్ష్యంగా చేసుకోవచ్చు.




## ఇరాన్‌కు రష్యా ఎందుకు సాయం చేయలేదంటే.. పుతిన్ సమాధానమిదే!

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో ఇరాన్‌పై దాడులు చేస్తోన్న ఇజ్రాయెల్‌కు మద్దతుగా అమెరికా కూడా రణరంగంలోకి దిగింది. టెహ్రాన్‌లో మెరుపుదాడులు చేసింది. ఇంత జరుగుతున్నా.. ఇరాన్‌కు సుదీర్ఘకాలంగా మిత్రదేశమైన రష్యా సాయం చేసేందుకు ముందుకురాకపోవడంపై ఆశ్చర్యం నెలకొంది. దీనిపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పందించారు. ఈ యుద్ధంలో తాము తటస్థంగా ఎందుకు ఉంటున్నామో వివరించారు. "ఒకప్పటి సోవియట్ యూనియన్, ఇప్పటి రష్యన్ ఫెడరేషన్‌కు చెందిన దాదాపు 20లక్షల మంది ఇజ్రాయెల్‌లో నివసిస్తున్నారు. మా దృష్టిలో ఇప్పుడది దాదాపు రష్యన్ మాట్లాడే దేశమే. దానిని పరిగణనలోకి తీసుకునే ఈ ఉద్రిక్తతల్లో మేం తటస్థంగా వ్యవహరించేందుకు ప్రయత్నిస్తున్నాం" అని సెయింట్ పీటర్స్‌బర్గ్ ఇంటర్నేషనల్ ఎకనమిక్ ఫోరమ్‌లో పుతిన్ వెల్లడించారు. మిత్ర దేశాలపై రష్యా నిజాయతీని కొంతమంది విమర్శిస్తున్నారని, వారంతా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే వారేనని పుతిన్ మండిపడ్డారు. అరబ్ దేశాలతో తమకు సుదీర్ఘకాలంగా అనుబంధం ఉందన్నారు. ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కోఆపరేషన్‌లో రష్యా అబ్జర్వర్‌గా ఉన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఇదిలా ఉండగా.. ఇరాన్‌కు అణ్వాయుధాలపై రష్యా మాజీ అధ్యక్షుడు, రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ ఛైర్మన్ దిమిత్రి మెద్వదేవ్ నిన్న కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశానికి అణ్వాయుధాలను సరఫరా చేసేందుకు చాలా దేశాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. అయితే, వాటి పేర్లను మాత్రం వెల్లడించలేదు. ఈ వ్యాఖ్యలు చర్చనీయాంశమైన వేళ.. తటస్థంగా ఉంటామంటూ పుతిన్ వివరణ ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.




హైదరాబాద్: ఒలింపిక్స్‌లో మన ప్రతిభను కనబరచడానికి కృషి చేయాలని తెలంగాణ ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఒలింపిక్ డే వేడుకలు నిర్వహించారు. 14 ప్రాంతాల నుంచి ఒలింపిక్ రన్ ద్వారా విద్యార్థులు ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు ఒలింపిక్స్‌లో తమ సత్తా చాటుతున్నాయన్నారు. ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం శుభవార్త చెబుతుందని చెప్పారు. ఈరోజు జరిగే తెలంగాణ క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం త్వరలో ప్రతిష్ఠాత్మకంగా తీసుకువస్తున్న కొత్త క్రీడా పాలసీకి ఆమోదం తెలపనుందని పేర్కొన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా క్రీడా పాలసీని తీసుకు వస్తోందన్నారు. దీని తర్వాత క్రీడాకారులకు మంచి ప్రోత్సాహకాలు ఉంటాయని చెప్పారు. గత ప్రభుత్వంలో చాలామందికి న్యాయం జరగలేదన్నారు. వారికి త్వరలో మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, పారా ఒలింపిక్ పతక విజేత దీప్తి జివాంజీ పాల్గొన్నారు.

## క్రేజీగా టెస్లా షోరూం అద్దెలు.. కళ్లు చెదరాల్సిందే

టెస్లా ఈవీ కార్లకుండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ సంస్థ తాజాగా ఇండియాలో ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. భవిష్యత్ అంశాల్ని పక్కన పెడితే.. ఇప్పుడు మాత్రం ఈ సంస్థ ఏర్పాటు చేస్తున్న షోరూం అద్దెల మీద ఆసక్తికర చర్చ నడుస్తోంది. దీనికి కారణం.. ఈ డీల్ రియాల్టీ మార్కెట్ లో కొత్త రికార్డుల్ని క్రియేట్ చేస్తున్నాయి. భారతదేశంలో తన మొదటి టెస్లా షోరూంను ముంబయిలో ఏర్పాటు చేయనున్నారు. ప్రపంచంలోనే ఈవీ వాహనాల్లో తిరుగులేని అధిక్యతను ప్రదర్శించే టెస్లా,. భారత్ లో తన మొదటి షోరూంను ఓపెన్ చేయటం ద్వారా ప్రపంచంలోనే మూడో అతి పెద్ద మార్కెట్ అయిన భారత్ లో ఎంట్రీ ఇస్తున్నట్లుగా చెప్పాలి. టెస్లా తన మొదటి కారు లాంచ్ విషయంలో కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ప్రపంచంలోనే అత్యధికంగా అమ్ముడయ్యే 'మోడల్ వై' తో భారత మార్కెట్ లోకి ఎంట్రీ ఇవ్వాలని భావిస్తోంది. వచ్చే నెలలో ముంబయిలో టెస్లా అధికారిక షోరూం షురూ కానుంది. అనంతరం దేశ రాజధాని ఢిల్లీలో ఇంకో షోరూంను ఏర్పాటు చేయనున్నారు. ముంబయిలోని టెస్లా షోరూం ఏర్పాటు చేస్తున్న ల్యాండ్ కు సంబంధించిన లీజు వ్యవహారాల్ని సీఆర్ఈ మ్యాట్రిక్స్ యాక్సెస్ అనే సంస్థ చూస్తోంది. ముంబయిలోని అత్యంత ఖరీదైన వాణిజ్య ప్రదేశమైన బాంద్రా కుర్లా కాంప్లెక్స్ లో టెస్లా షోరూం ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకోసం ఐదేళ్ల కాంటాక్టు చేసుకున్నట్లు చెబుతున్నారు. ఈ ఐదేళ్ల లీజు ఎంతో తెలుసా? అక్షరాల రూ.23.38 కోట్లుగా చెబుతున్నారు. మొత్తం 4 వేల చదరపు అడుగుల స్థలంలో షోరూంను ఏర్పాటు



చేయనున్నారు. వాణిజ్య ప్రదేశానికి సంబంధించి ఇంతటి భారీ డీల్ దేశంలోనే రికార్డుగా పేర్కొంటున్నారు. ఇప్పటివరకు ఇదే అత్యంత ఖరీదైన షోరూం లీజు డీల్ గా పేర్కొంటున్నారు. ముంబయి నార్త్ అవెన్యూలోని మేకర్ మాక్సిటీ అనే కమర్షియల్ కాంప్లెక్స్ లో టెస్లా.. షోరూం స్థలాన్ని లీజుకు తీసుకుంది. ఈ లీజు ఒప్పందం కూడా రికార్డుగా పేర్కొంటున్నారు. మొదటి ఏడాది నెలకు రూ.35.26 లక్షలు చొప్పున షోరూం లీజుకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రతి ఏటా పెంచుకుపోయే ఈ లీజు మొత్తం ఐదేళ్లకు ప్రతి నెలా రూ.42.86 లక్షలుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రెండు ప్రాంతాలతో పాటు ముంబయి కుర్లా ప్రాంతంలోని లోధా లాజిస్టిక్స్ పార్కులో 24,565 చదరపు అడుగుల స్థలాన్ని వేర్ హౌస్ కోసం లీజుకు తీసుకున్నారు. ఐదేళ్ల కాలానికి రూ.24.38 కోట్ల అద్దెను చెల్లించేందుకు వీలుగా ఒప్పందాలు కుదుర్చుకోవటం గమనార్హం. కార్ల అమ్మకాల సంగతి ఎలా ఉన్నా.. తమ కార్యకలాపాలకు అవసరమైన స్థలాన్ని అద్దెకు తీసుకునే లీజు మొత్తంలో మాత్రం టెస్లా సరికొత్త రికార్డుల్ని క్రియేట్ చేస్తుందని మాత్రం చెప్పక తప్పదు.

## లోక్ సభ సీట్ల పెంపుపై మోడీ సర్కారు కొత్త ఫార్ములా!



దేశ వ్యాప్తంగా లోక్ సభ నియోజకవర్గాల పెంపు విషయంలో ఇప్పటికే బోలెడంత చర్చ జరిగింది. ఈ సందర్భంగా జనాభా ఆధారంగా సీట్ల పెంపు జరిగితే పలు రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందున్న వాదనలు బలంగా వినిపించాయి. ఇలాంటి వేళ.. లోక్ సభ సీట్ల పెంపు అంశంపై కేంద్రంలోని మోడీ సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా చెబుతున్నారు. ఇప్పటివరకు చర్చలు జరిగిన దానికి భిన్నంగా.. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్లు పెరిగేందుకు వీలుగా ఒక ఫార్ములాను మోడీ సర్కారు సిద్ధం చేసినట్లు చెబుతున్నారు.

దీని ప్రకారం రాష్ట్రాల్లోని జనాభా ఆధారంగా కాకుండా.. రాష్ట్రాల వారీగా ప్రతి రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న సీట్లకు 20 శాతం నియోజకవర్గాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని భావిస్తున్నారు.

ఈ లెక్కన ఉమ్మడి ఏపీలో మొత్తం 42 స్థానాలు ఉండేవి. అంటే.. 8 స్థానాలు పెరగనున్నాయన్న మాట. తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత ఏపీ పరిధిలో 25 స్థానాలు ఉండగా.. తెలంగాణలో 17 స్థానాలు ఉండటం తెలిసిందే. అంటే.. 5 స్థానాలు ఏపీలో.. 3 స్థానాలు తెలంగాణలో పెరిగే వీలుందన్న మాట వినిపిస్తోంది. జనగణన ఆధారంగా లోక్ సభ సీట్లు పెంచితే కొత్త ఆందోళనలు తెర మీదకు రావటం ఖాయమని చెబుతున్నారు.

ఎందుకంటే.. 1971 జనాభా లెక్కల సేకరణ జరిగినప్పుడు దేశ జనాభా 55 కోట్లు మాత్రమే. ఇప్పుడు అది కాస్తా 145 కోట్లకు చేరుకుంది. నియోజకవర్గాల పెంపు వేళ.. దక్షిణాధి రాష్టరాలకు నష్టం వాటిల్లకుండా నియోజకవర్గాల సంఖ్య పెంచటం మంచిదని చెబుతున్నారు. అయితే.. ఇప్పటివరకు వినిపిస్తున్న వాదన ప్రకారం దక్షిణాదితో పోలిస్తే ఉత్తరాదిన జనాభా పెరిగినట్లుగా వినిపించే వాదనలో సాక్ష్యాలు లేవని.. జనగణన తర్వాతే ఈ విషయంపై స్పష్టత వసతుందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. లోక్ సభ స్థానాల పెంపు అంశానికి సంబంధించి పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో(జులై 21 నుంచి ఆగస్టు 11) సీట్ల పెంపు బిల్లును ప్రవేశ పెడతారని విశ్వసనీయ వర్గాల భోగట్టా. 2029లో దేశ వ్యాప్తంగా లోక్ సభకు.. అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన రాజ్యాంగ సవరణ బిల్లును లోక్ సభలో ప్రవేశ పెట్టేందుకు వీలుగా కేంద్రం తయారవుతుందని చెబుతున్నారు. పహల్ గామ్ లో ఉగ్రదాడి..ఆపరేషన్ సిందూర్.. పాక్ తో ఉద్రిక్తతలతో యుద్ధాన్ని మొదలుపెట్టి కేవలం నాలుగు రోజుల్లోనే ముగించటం లాంటి అంశాలపై అధికారపక్షాన్ని విపక్షాలు విరుచుకుపడాలని భావిస్తున్న వేళ.. అందరి చూపు కొత్త బిల్లు మీద పడేందుకు వీలుగా సీట్ల పెంపు అంశాన్ని తెర మీదకు తెస్తున్నట్లు చెబుతున్నారు.

## ఇరాన్ లో ఖమేనీని ఎక్కడ దాచారో తెలుసా..?

ఇజ్రాయెల్ – ఇరాన్ మధ్య జరుగుతున్న భీకర యుద్ధంలో ఓ కీలక పరిణామం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... ఈ యుద్ధంలోకి అమెరికా ఎంట్రీ ఇచ్చింది. ఇరాన్ అణుశుద్ధి కేంద్రాలపై బంకర్ బ్లస్టర్ బాంబులతో విరుచుకుపడింది. ఈ సందర్భంగా మూడు అణుశుద్ధి కేంద్రాలను ధ్వంసం చేసినట్లు అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ తెలిపారు. దీంతో.. ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. ఈ సందర్భంగా స్పందించిన ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరఘ్చి.. అమెరికా దాడిని తీవ్రంగా ఖండించారు. ఇక అగ్రరాజ్యానికి శాశ్వత గాయం ఖాయమైందని వ్యాఖ్యానించారు. మరోవైపు అటు ఇజ్రాయెల్ లోను, ఇటు అమెరికాలోనూ హై అలర్ట్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఖమేనీ ఎక్కడ అనే చర్చ తెరపైకి వచ్చింది! అవును... ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హతమారిస్తేనే యుద్ధం ముగిసినట్లు అని ఇజ్రాయెల్ ప్రధాని.. ఖమేనీ ఎక్కడున్నారో తెలిసినా ప్రస్తుతానికి ఆయనను చంపే ఉద్దేశ్యంలేదని ట్రంప్



వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఖమేనీ భద్రత విషయంలో ఇరాన్ కీలక చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి ఇరాన్ తో యుద్ధం మొదలై, నెతన్యాహు స్టేట్ మెంట్ అనంతరం ఖమేనీ బంకర్ లో తలదాచుకున్న సంగతి తెలిసిందే. అయితే.. శనివారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కొన్ని బంకర్లలో ఆశ్రయం పొందుతున్న పలువురు కీలక కమాండర్లు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు ఇరాన్ లోని అణుస్థావరాలపై అమెరికా సైతం దాడులు మొదలుపెట్టింది. దీంతో... ఖమేనీ భద్రతను మరింత కట్టుదిట్టం చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా... ఎటువంటి సిగ్నళ్లకు అందకుండా ఉండడానికి ఆయన ఉన్న ప్రదేశంలో ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ లను పూర్తిగా నిలిపివేసినట్లు చెబుతున్నారు. ఈ సమయంలో భారీ పేళుల్లను సైతం తట్టుకునేలా ఆయనను అత్యంత సురక్షితమైన బంకర్ ఉంచినట్లు చెబుతున్నారు. ఈ సమయంలో బయట జరుగుతున్న విషయాలను, తాజా పరిస్థితులను ఎప్పటికప్పుడు ఆయనకు చేరవేసేందుకు, భవిష్యత్ కార్యచరణపై చర్చించేందుకు.. ఆయనకు అత్యంత సన్నిహితులైన ముగ్గురు వ్యక్తులు ఆయనకు అందుబాటులో ఉన్నారని అంటున్నారు. మరోవైపు.. ఇజ్రాయెల్ తో యుద్ధం నేపథ్యంలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ.. తన వారసుడి కోసం కసరత్తులు ప్రారంభించినట్లు తెలుస్తోంది. తనను ఐడీఎఫ్ దళాలు హతమారుస్తాయనే ఆందోళనలో ఉన్న ఖమేనీ.. తన వారసులుగా ముగ్గురి పేర్లను పరిశీలిస్తున్నట్లు న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది.

## సినిమా 'షో'

### మృణాల్ ను వాడుకుంటారా? సైడ్ చేస్తారా?

కొన్ని సినిమాల్లో కథ కంటే క్యాస్టింగ్ మరింత ఇంట్రెస్ట్ ను కలిగిస్తోంది. బాలీవుడ్ సీక్వెల్స్ అయితే క్యాస్టింగ్ విషయంలో చాలా మిస్టరీగా ఉంటాయి. ఈ నేపథ్యంలో త్వరలో రిలీజ్ కాబోతున్న ఓ బాలీవుడ్ సినిమా క్యాస్టింగ్ విషయంలో ఆసక్తిని కలిగిస్తోంది. జులై లో రిలీజ్ కానున్న సన్ ఆఫ్ సర్దార్2 క్యాస్టింగ్ ఇప్పుడు అందరిలోనూ ఇంట్రెస్ట్ ను పెంచుతోంది. దానికి కారణం ఈ సినిమాతో పంజాబీ స్టార్ నటి నీరూ బజ్వా బాలీవుడ్ లోకి అడుగుపెడుతుంది. ఈ సినిమా సన్ ఆఫ్ సర్దార్ కు సీక్వెల్ గా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. సన్ ఆఫ్ సర్దార్ సినిమా రాజమౌళి దర్వకత్వంలో వచ్చిన మర్యాద రామన్నకు రీమేక్ గా తెరకెక్కి మంచి హిట్ అందుకుంది. ఇప్పుడు దానికి సీక్వెల్ గా వస్తున్న సినిమా మంచి కథతో ఆడియన్స్ ను మెప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక అసలు విషయానికొస్తే సన్ ఆఫ్ సర్దార్2 సినిమాలో అజయ్ దేవగణ్ భార్యగా నీరూ బజ్వా నటిస్తోందని వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి.



పంజాబీ సినీ ఇండస్ట్రీలో నీరూ బజ్వాకు మంచి ఆదరణ ఉంది. ఆ జనాదరణ సన్ ఆఫ్ సర్దార్ ఫ్రాంచైజ్ కు కొత్త ఆడియన్స్ ను తీసుకొస్తుందని, ఈ సినిమాలో నీరూ బజ్వా క్యారెక్టర్ చాలా గణనీయంగా ఉంటుందని అంటున్నారు. నీరూ అజయ్ దేవగణ్ భార్య పాత్రలో నటిస్తుంటే మరి మృణాల్ ఠాకూర్ ఏ పాత్రలో కనిపించనుందని ఇప్పుడు ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. సౌత్ లో మంచి హీరోయిన్ గా పేరు తెచ్చుకుని స్టార్ స్టేటస్ ను తెచ్చుకున్న మృణాల్ కు కూడా భారీ ఎత్తున ఫ్యాన్స్ ఉన్నారు. ఇప్పటివరకు మృణాల్ బాలీవుడ్ లో పలు సినిమాలు చేసినప్పటికీ అమ్మడికి ఇంకా చెప్పుకోదగ్గ హిట్ మాత్రం దక్కలేదు. దీంతో అజయ్ దేవగణ్ తో చేస్తున్న సన్ ఆఫ్ సర్దార్2 ఆమెకు బాలీవుడ్ లో మంచి బ్రేక్ ఇస్తోందని అందరూ భావిస్తున్న టైమ్ లో సడన్ గా అజయ్ దేవగణ్ భార్య పాత్రలో నీరూ నటిస్తుందని అంటున్నారు. అజయ్ దేవగణ్ కు భార్యగా నీరూ నటిస్తే మరి మృణాల్ అతని ప్రేయసి పాత్రలో కనిపిస్తుందా లేక మృణాల్ కు అంతకు మించిన క్యారెక్టర్ ఏమైనా ఇచ్చారా? అదీ లేదంటే మంచి టాలెంట్ ఉన్న మృణాల్ ను కేవలం గ్లామర్ రోల్ కు పరిమితం చేశారా అనేది తెలియాల్సి ఉంది.

## విజయ్ స్టైలిష్గా.. మరింత పవర్ఫుల్గా




తమిళ స్టార్ హీరో విజయ్ ప్రస్తుతం చేస్తున్న సినిమా జన నాయగన్. ఆదివారం విజయ్ బర్త్ డే సందర్భంగా అర్ధరాత్రి చిత్ర యూనిట్ జన నాయగన్ నుంచి ఫస్ట్ రోర్ పేరుతో టీజర్ ను రిలీజ్ చేయగా, ఆ టీజర్ కు ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. అర్ధరాత్రి రిలీజైన టీజర్, సినిమాపై అంచనాలను మరింత పెంచింది. దీంతో విజయ్ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు. విజయ్ ను డైరెక్టర్ వినోత్ పవర్ఫుల్ పోలీసాఫీసర్ గెటప్ లో చూపించాడు. టీజర్ తోనే ఫ్యాన్స్ ఫుల్ ఆనందంతో కేరింతలు కొడుతుంటే ఫ్యాన్స్ ఉత్సాహాన్ని రెట్టింపు చేయాలని సినిమా నుంచి విజయ్ పోలీస్ లుక్ లో ఉన్న ఓ సరికొత్త పోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు మేకర్స్. టీజర్ లో లాగానే విజయ్ ఈ పోస్టర్ లో కూడా చాలా పవర్ఫుల్ గా కనిపిస్తున్నాడు. చాలా కాలం తర్వాత తమ అభిమాన హీరో తిరిగి పోలీస్ పాత్ర చేస్తుండటం, దానికి తోడు ఇందులో విజయ్ స్టైలిష్ గా కూడా కనిపిస్తుండటంతో జన నాయగన్ లుక్ కు ఆడియన్స్ నుంచి భారీ ఎత్తున ప్రశంసలొస్తున్నాయి. ఈ సినిమాను దేశ వ్యాప్తంగా ఒకేసారి, ఒకే టైటిల్ తో రిలీజ్ చేయాలనే ఆలోచనతో సినిమాకు జన నాయగన్ అనే టైటిల్ ను ఫిక్స్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలో పూజా హెగ్డే, బాబీ డియోల్, మమిత బైజు, గౌతమ్ మీనన్, ప్రకాష్ రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్ లో రూపొందుతున్న జన నాయగన్ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, విజయ్ రాజకీయాల్లోకి వెళ్లబోతూ చేస్తున్న ఆఖరి సినిమాగా ఇది తెరకెక్కుతుంది. విజయ్ నుంచి రాబోతున్న ఆఖరి సినిమా కావడంతో జన నాయగన్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి.

## కళ్యాణి ప్రియదర్శన్.. ది బాస్ లేడీ వైబ్స్

క్యూట్ లుక్స్తో కుర్రకారు గుండెల్ని కొల్లగొడుతున్న ఈ బ్యూటీ ఎవరో పరిచయం చేయాలా? .. అసలు పరిచయమే అవసరం లేని పేరు- కళ్యాణి ప్రియదర్శన్. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ కుమార్తె. బలమైన సినీనేపథ్యం నుంచి వచ్చిన కళ్యాణి బహుభాషల్లో నటిగా వెలిగిపోతోంది. ఓవైపు మలయాళం, మరోవైపు తెలుగు, తమిళంలోను నటిస్తూ బిజీగా ఉంది. కళ్యాణి ప్రస్తుతం జెనీ అనే తమిళ చిత్రంలో నటిస్తోంది. దీంతో పాటు %-%ఒడం కుతిర చదుం కుతిర - అనే మలయాళ చిత్రం, లోకా- చాప్టర్ 1 (చంద్ర) అనే మలయాళ సూపర్ హీరో ఫిలింలోను నటిస్తూ బిజీగా ఉంది. లోకా చాప్టర్ 1 సినిమాని దుల్కార్ సల్మాన్ సహభాగస్వామిగా నిర్మిస్తున్నారు. కళ్యాణి సోషల్ మీడియాల్లోను బిజీగా ఉంది. ఈ బబ్లీ బ్యూటీ ఇటీవల కొంత ట్రెడిషన్ కి ఆవల ట్రెండీ లుక్స్ లో కనిపిస్తూ ఆకట్టుకుంటోంది. ఇంతకుముందే కళ్యాణి బికినీ లుక్ ఒకటి ఇంటర్నెట్లో వైరల్ గా మారింది. ఇప్పుడు ట్రెడిషనల్ వైట్ టాప్, బ్రౌన్ ట్రాక్ ధరించి అదిరిపోయే ఫోజు ఇచ్చింది. ఆ భుజానికి తగిలించిన వైట్ హ్యాండ్




బ్యాగ్, బ్లాక్ గాగుల్స్, ఐఫోన్... కళ్యాణి ఇస్టయిల్ ప్రతిదీ కుర్రకారును ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. కళ్యాణి కెరీర్ గ్రాఫ్ని పరిశీలిస్తే కొన్ని ఆసక్తికర చిత్రాల్లో నటించింది. ఈ భామ ప్రారంభం అసిస్టెంట్ ప్రొడక్షన్ డిజైనర్గా తన కెరీర్ను ప్రారంభించింది. ఆమె తెలుగు చిత్రం హాలో (2017)లో కథానాయికగా నటనా రంగ ప్రవేశం చేసింది. ఉత్తమ ఆరంగేట్ర కథానాయికగా ఫిల్మ్ఫేర్ సౌత్ అవార్డును గెలుచుకుంది. ఆ తర్వాత హీరో (2019)తో తమిళ సినీ రంగంలో ప్రవేశించింది. వారణే అవశ్యముండ్ (2020)తో మలయాళ సినిమాకు పరిచయమైంది. ఆ తర్వాత చిత్రలహరి (2019), మానాడు (2021), హృదయం (2022), తాళ్ళుమాళ (2022), బ్రో డాడీ (2022) చిత్రాల్లో నటించింది. వీటిలో చివరిదానికి ఆమె మలయాళంలో ఉత్తమ నటిగా సైమా అవార్డును గెలుచుకుంది. ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తూ కెరీర్ పరంగా ఫుల్ బిజీగా ఉంది.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417